క్లుప్తంగా

'ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎదగాలి'



గిరిజన సాంప్రదాయ నృత్యం చేస్తున్న విద్యార్థినులు

టెక్కలి: బీఈడీ చేస్తున్న అభ్యర్థులంతా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎదగాలని జిల్లా విద్యా శాఖాధికారి జి.పగడాలమ్మ ఆకాంక్షించారు. మండలంలోని పాతనౌపడ సమీపంలో ఉన్న పీబీ దేవి బీఈడీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈవోలు జె.చిన్నవాడు, డి.నాగభూషణరావు, కళాశాల యాజమాన్యం పి.సి.హెచ్.ఆజాద్, పి.పరమేశ్వరరావు, భోగస్వామి, రుక్మాంధరరావు, ఆర్.రామారావు, ఎన్.కృష్ణారావు, ఎ.అప్పన్న, ప్రమీళారాణి, సుజాత, జ్యోతి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈవో పగడాలమ్మ

టెక్కలి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదోతరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో జి.పగడాలమ్మ అన్నారు. మండలంలోని తలగాం ఎట్ నౌపడ ఆర్ఎస్ పాఠశాల, రాళ్లపేట ప్రాథమిక పాఠశాలలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చి 3వ తేదీ నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు నెల రోజుల పాటు పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందజేయాలన్నారు. అనంతరం పాఠశాలలో నాడు–నేడు పనులను పరిశీలించారు. అంతకు ముందు రాళ్లపేట పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. అలాగే విద్యార్థులు రూపకల్పన చేసిన పలు ప్రాజెక్టులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమెతో పాటు ఉపాధ్యాయులు భాస్కరరావు, ధర్మారావు, ప్రకాశ్, శివానంద్, సుధాకర్, నగేష్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

బెడ్ల సంఖ్య పెంచాలని వినతి



మంత్రి రజనీకి వినతిపత్రం అందజేస్తున్న ప్రకాష్

కవిటి: ఏపీ వైద్య విధాన పరిషత్ పర్యవేక్షణలో కవిటిలో నిర్వహిస్తున్న సామాజిక ఆరోగ్య కేంద్రంలోని డయాలసిస్ సెంటర్‌లో రోగుల సంఖ్య పరిమితికి మించి ఉన్నందున బెడ్ల సంఖ్య పెంచడంతో పాటు, డయాలసిస్ పరికరాల సంఖ్యను పెంచాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ కోరారు. ఈ మేరకు మంగళవారం తలతంపరలో కిడ్నీ బాధితులతో ముఖాముఖీలో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్ర వైద్యారోగ్య శాఖామంత్రి విడదల రజనీకి వినతి పత్రం అందజేశారు. అలాగే ఆర్.బెలగాం, రాజపురం, బొరివంక పీహెచ్‌సీ కేంద్రాల్లో సైతం డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని విన్నవించారు. వెంటనే మంత్రి స్పందించి కవిటి, సోంపేట సీహెచ్‌సీలకు చెరో 5 చొప్పున డయాలసిస్ పరికరాలు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారని కడియాల ప్రకాష్ తెలిపారు.

శ్మశానవాటికకు ప్రహరీ నిర్మించండి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న పూర్ణచంద్రరావు

కంచిలి: మండలంలోని తలతంపర గ్రామ శ్మశానవాటికకు ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు గ్రామానికి మంగళవారం విచ్చేసిన కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం శ్మశానవాటిక స్థలం కొంతవరకు ఆక్రమణలకు గురైందని, దీన్ని అడ్డుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామ ఎస్సీ సంఘ ప్రతినిధి మర్రిపాటి పూర్ణచంద్రరావు తదితరులు ఉన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఇచ్ఛాపురం: ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ఉపయోగించుకొని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మహిళా సంఘాలతో మెప్మా అధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక పథకాలు అందజేస్తున్నారన్నారు. బ్యాంక్‌కు చెల్లించాల్సిన రుణాలను సకాలంలో చెల్లిస్తే రుణమాఫీ వర్తించే అవకాశముందన్నారు. కార్యక్రమంలో మెప్మా సీఈవో బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

భావితరాల భవితే ధ్యేయం

- కిడ్నీ మహమ్మారి నుంచి రక్షించుకోవాలి
- వ్యాధికి కారణం రీసెర్చ్‌తోనే సాధ్యం
- మార్చి నెలాఖరకు రీసెర్చ్ సెంటర్ ప్రారంభం
- రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని



మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని, పక్కనే మంత్రి అప్పలరాజు తదితరులు

కాశీబుగ్గ: కిడ్నీ మహమ్మారి నుంచి భావితరాలను రక్షించడమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని మంత్రి విడదల రజిని అన్నారు. ఉద్దాన పర్యటనలో భాగంగా పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశ మందిరంలో జిల్లా వైద్యాధికారులతో సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉద్దాన ప్రాంతంలో కారణం ఏంటన్నది తెలియకుండా కిడ్నీ వ్యాధితో ప్రజలు ప్రాణాలు కోల్పోతుండడం బాధాకరమన్నారు. మరణాలపై ఒక్కొక్కరు ఒక్కోవిధంగా చెబుతున్నారని, దీనికి గల కారణాలు పూర్తిస్థాయిలో తెలియాలంటే రీసెర్చ్ అవసరమన్నారు. వచ్చే మార్చి నాటికి కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌ను ప్రారంభించుకొని కిడ్నీ వ్యాధిగ్రస్తులకు సేవలు అందిస్తామని వెల్లడించారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, కిడ్నీ వ్యాధిగ్రస్తులు వెల్లడించిన అనేక విషయాలను సీఎంకు వివరించి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

రూ.10 వేల పింఛన్‌తో భరోసా

డయాలసిస్ చేసుకుంటున్నవారికి రూ.10 వేల పింఛన్ అందజేసి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భరోసాగా నిలుస్తోందని మంత్రి విడదల రజిని అన్నారు. ఇకపై రెండు కిడ్నీలు పాడైపోయి కిడ్నీ మార్పిడి చేసుకున్న వారికి రూ.5 వేల నెలవారీ పింఛన్ అందిస్తామని తెలియజేశారు. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గంలో ఉన్నటువంటి రెండు మున్సిపాలిటీలు, ఏడు మండలాల పరిధిలోని 807 గ్రామాల్లో ప్రజలకు ఉచితంగా స్కీనింగ్ టెస్టులు నిర్వహించి, వైద్య సేవలు అందిస్తామని పేర్కొన్నారు. రీసెర్చ్ సెంటర్ ప్రారంభమైతే అందులో 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఉంటుందని, 40 పడకలతో డయాలసిస్ సెంటర్ సైతం పెడతామని తెలియజేశారు. శ్రీకాకుళం జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో నెఫ్రాలజిస్టు లేరని, మన ప్రభుత్వం వచ్చాక రిమ్స్‌లో నియమించామని, ఇప్పుడు ప్రతీ శనివారం పలాసలో వైద్య సేవలు అందిస్తున్నామని గుర్తు చేశారు. సమావేశంలో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, ప్రిన్సిపాల్ సెక్రటరీ కృష్ణబాబు, కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ నివాస్, ఏపీఎంఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర్‌రెడ్డి, కమిషనర్ ఆఫ్ ఏపీవీవీపీ డాక్టర్ వినోద్, మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వినతుల వెల్లువ

మంత్రి విడదల రజిని పర్యటనలో పలువురు వినతి పత్రాలు అందజేశారు. తమను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని 108 ఉద్యోగులు కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం ఇచ్చినవారిలో విజయ్‌మోహన్, సత్యం, తారక్, వెంకట్రావు, మురళీమోహన్, కుమారస్వామి, తనోజ్ తదితరులు ఉన్నారు. అలాగే రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ ఉద్యోగుల సంఘం తరుపున ఉద్యోగులు సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు. గత 20 సంవత్సరాలుగా ఎయిడ్స్ నియంత్రణ విభాగంలో వివిధ హోదాల్లో ఉద్యోగులు పనిచేస్తున్నప్పటికీ సమాన పనికి సమాన వేతనం మంజూరు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బగాది శ్రీకాంత్ పాల్గొన్నారు.

చిరుకానుక

పలాస పర్యటనకు విచ్చేసిన మంత్రి విడదల రజనీకి సూక్ష్మ కళాకారుడు కొత్తపల్లి రమేష్ ఆచారి ఒక చిన్న బంగారు వైఎస్సార్‌సీపీ జెండాను బహుకరించారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంలో అందజేశారు.

– కాశీబుగ్గ



సంప్రదాయ కళలను ప్రోత్సహించాలి

- మంత్రి ధర్మాన ప్రసాదరావు



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

సోంపేట: సాంప్రదాయ కళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. పట్టణంలోని సంస్కార భారతి విద్యాసంస్థల్లో ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ ఆధ్వర్యంలో మంగళవారం సంగీత విభావరి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ.. కళల ఆవశ్యకత గురించి తెలియజేశారు. ఇలాంటి కార్యక్రమం ఏర్పాటు చేసిన నిమ్మన పురుషోత్తం భాగవతార్ కళావేదిక సభ్యులకు, డాక్టర్ నిమ్మన దాస్‌కు అభినందనలు తెలిపారు. మాజీ కేంద్రమంత్రి కిల్లి కృపారాణి మాట్లాడుతూ నేటి యవత కళలపై మక్కువ పెంచుకొని మంచి కళాకారులుగా గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ మాట్లాడుతూ కళాకారులను గౌరవించి, కళలను ప్రోత్సహించే కార్యక్రమాలు నేటి సమాజానికి అవసరం అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ నర్తు రామారావు, డీసీఎంఎస్ చైర్మన్ సల్ల సుగుణ, ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతి దివ్య, మామిడి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వివక్ష ఎందుకు

- ఎంపీడీవోను ప్రశ్నించిన మండల పరిషత్ సభ్యులు
- సర్వసభ్య సమావేశం బహిష్కరణ



మాట్లాడుతున్న ఎంపీపీ ఉమ

కోటబొమ్మాళి: మండలంలోని కొన్ని పంచాయతీలకు అభివృద్ధి పనుల కేటాయింపుపై వివక్ష చూపిస్తున్నారని, మండల పరిషత్ నిధుల లెక్కలను తమకు చెప్పడం లేదని పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్‌ను ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రోణంకి ఉమా అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీలు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజారాణి, ఎంపీటీసీ బొడ్డు అప్పన్న, సర్పంచ్‌లు నూక సత్యరాజ్, సుంకరి జనార్ధన, జి.కేశవరావు తదితరులు ఎంపీడీవోను ప్రశ్నించారు. అయితే అన్ని పంచాయతీలకు ప్రాధాన్యతా క్రమంలో నిధులు కేటాయిస్తున్నామని, పంచాయతీ తీర్మానాలిస్తే పనులు మంజూరు చేస్తామని ఎంపీడీవో తెలియజేశారు. గతంలో అనేకమార్లు తీర్మానాలిచ్చినా పనులు కేటాయించలేదంటూ నిరసనగా పలువురు సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. అనంతరం ధాన్యం సేకరణలోని నిబంధనలు సరిచేయాలని, ఉపాధి హామీ పనులల్లో కూలీల పనిదినాలను పెంచాలని చిన్నసాన ఎంపీటీసీ నంబాళ్ల రాజశేఖర్ కోరారు. కమలనాభపురంలో అంగన్‌వాడీ కార్యకర్త అరుణ కేంద్రాన్ని సక్రమంగా నడపడం లేదని, దర్యాప్తు చేయాలని కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.హేమసుందరరాజు విన్నవించారు. పట్టుపురంలో అంగన్‌వాడీ భవనానికి స్థలం కేటాయించాలని సర్పంచ్ మెట్ట ఈశ్వరమ్మ కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ దుబ్బ వెంకటరావు, తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ, ఆర్అండ్‌బీ జేఈ సరోజా, విద్యుత్‌శాఖ ఏఈ బీవీ సురేష్, ఏపీఎం రాము, ఈవోపీఆర్డీ రాజారావు, ఈవో యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహపూర్వక వాతావరణం



జెర్సీలను ఆవిష్కరిస్తున్న అతిథులు

కవిటి: క్రీడలతో గ్రామాల్లో స్నేహపూర్వక వాతావరణం నెలకొంటుందని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని ఉద్దానం యూత్‌క్లబ్ ఆఫ్ బొరివంకలో ఉత్కళాంధ్ర స్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు ఒడిశా రాష్ట్రానికి చెందిన పలు జట్లు టోర్నీలో పాల్గొంటున్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్, లోళ్ల రాజేష్, వీఆర్వోల సంఘం జిల్లా బాధ్యుడు వజ్జ బాలకృష్ణ, సర్పంచ్ శ్రీరాంప్రసాద్, ఎంపీటీసీ దుద్ది సతీష్, మాజీ ఎంపీటీసీ విజయకృష్ణ, సంఘం అధ్యక్షుడు లొట్ల దీనబంధు, గెస్ట్ అధ్యక్షుడు బల్లెడ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు

వజ్రపుకొత్తూరు రూరల్: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో ఈశ్వరమ్మ హెచ్చరించారు. గ్రామ సచివాలయ సిబ్బంది పనితీరుపై ఫిర్యాదులు అందడంతో గరుడభద్ర, అక్కుపల్లి గ్రామ సచివాలయాలను మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాయల ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. సకాలంలో సమస్యలను పరిష్కరించి ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలన్నారు. ఆమెతో పాటు సచివాలయ సిబ్బంది ఉన్నారు.

విజయవంతం చేయండి

మందస: సిక్కోలు జానపద సాహిత్య కళా వేదిక ఆధ్వర్యంలో ఈనెల 11న పలాస మండలం చిన్ననీలావతిలో జరిగే సిక్కోలు జానపద కళాజాతర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవస్థాపక అధ్యక్షుడు రాపాక ధనరాజు, అధ్యక్షుడు మల్లేన దేవరాజు, మామిడి కృష్ణారావు, దున్న రామారావు కోరారు. ఈ మేరకు మందసలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ జానపద కళాకారులు గద్దర్, సోమన్నతో పాటు ఇతర జిల్లాలు, ఒడిశా నుంచి కూడా కళాకారులు వస్తున్నారన్నారు. కనుమరుగవుతున్న జానపదాలను రక్షించుకోవడానికి చేస్తున్న ప్రయత్నాన్ని ప్రజలు ఆదరించాలని కోరారు.

'మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి'

నందిగాం: ధాన్యం కొనుగోలు సమయంలో ఇబ్బందులకు గురి చేస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ ఎం.సుధారాణికి పలువురు రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తమ సమస్యలను విన్నవించారు. వినతిపత్రం అందజేసినవారిలో ప్రగడ ప్రభయ్య, ప్రగడ ఖగేశ్వరరావు, డిక్కల కిరణ్, ప్రగడ శ్యామసుందరరావు, ప్రగడ చిన్నబాబు ఉన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

టెక్కలి రూరల్: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలో వివిధ ప్రాంతాలకు కుళాయిలు ద్వారా తాగునీటి సరఫరా చేసే సమగ్ర రక్షిత మంచినీటి పథకం పైపులైన్లు మరమ్మతులకు గురవ్వడంతో రెండు రోజుల పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ మోహన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

జిల్లాస్థాయి క్విజ్ పోటీలు

సోంపేట: మండలంలోని ఇస్కలపాలేం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా ఈనెల 15వ తేదీన జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నిరుద్యోగులు, విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని పేర్కొన్నారు. ప్రథమ బహుమతి రూ.7,500, ద్వితీయ బహుమతి రూ.5,000, తృతీయ బహుమతి రూ.3,500, నాలుగు, ఐదు స్థానాలకు రూ.1000 చొప్పున అందజేయనున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు జ్ఞాపికలు బహుకరించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు 72870 03875, 63021 85843, 99085 30825 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సర్వేకు సహకరించండి

భూ రికార్డుల ప్రక్షాళన కోసం చేపడుతున్న సమగ్ర భూసర్వేకు రైతులు సహకరించాలని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ కోరారు. మండలంలోని కణితూరులో సర్వేను మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ జోగారావు, నాయకులు పేరాడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నందిగాం



సర్వేను ప్రారంభిస్తున్న పేరాడ తిలక్

నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్
- టెక్కలిలో గడప గడపకూ మన ప్రభుత్వం



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. టెక్కలి మేజర్ పంచాయతీ గ్రామ సచివాలయం–4 పరిధి లచ్చన్నపేట, సోమయ్యవలస గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గత మూడున్నరేళ్లుగా ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు తెలియజేశారు. గ్రామాల్లో సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎ.సరోజనమ్మ, ఎంపీటీసీ పి.హేమలత, పీఏసీఎస్ చైర్‌పర్సన్ పి.జనకమోహన్‌రావు, డైరెక్టర్ జి.తేజా, వార్డు సభ్యుడు టి.లోకేశ్వరరావు, పి.రమణబాబు, నాయకులు బి.హరి, జి.అప్పలరెడ్డి, బి.రమేష్, పట్నాన బాలకృష్ణ, టి.ఆదినారాయణరెడ్డి, బి.నాగు, ఆర్.జయమోహన్, జి.భాను, ఎస్.మోహన్, డి.మదీన్, సిమ్మన్న, ఎ.రాహుల్, వర్తక సంఘం అధ్యక్షుడు వి.గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- పిరియా సాయిరాజ్
- కవిటిలో గడప గడపకూ మన ప్రభుత్వం



సంక్షేమ పథకాలను వివరిస్తున్న పిరియా సాయిరాజ్ తదితరులు

కవిటి: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. మండలంలోని కవిటి–2 సచివాలయం పరిధి 8, 9, 10, 13 వార్డుల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక కారణాలతో తమకు వివిధ ప్రభుత్వ పథకాలు అందడం లేదని పలువురు తెలియజేశారు. దీంతో అర్హులకు పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కడియాల ప్రకాష్, సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఎంపీటీసీ ఎ.హేమలత, ధర్మారావు, కవిటి–1 ఎంపీటీసీ సభ్యుడు పి.నీలాచలం, కో–ఆప్షన్ సభ్యుడు పాండవ శేఖర్, వైఎస్సార్‌సీపీ నేతలు కృష్ణారావు, వై.నీలయ్య, బీన ఢిల్లీరావు, బి.రమణ, జల్లు నరేష్, దేవాడ దుర్యోధన, కోళ్ల తులసి తదితరులు పాల్గొన్నారు.

సత్తాచాటిన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

టెక్కలి: ఈనెల 5వ తేదీ నుంచి రెండు రోజుల పాటు గుంటూరు కలాం హెచ్‌ఆర్‌ఐటీలో నిర్వహించిన నేషనల్ లెవల్ స్టూడెంట్ టెక్నో మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌లో టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల సివిల్ విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించి సత్తాచాటారు. ఫైనలియర్ చదువుతున్న సీహెచ్ సునందా, ఎన్.సంధ్య, ఎ.శ్యామల, ఎన్.ప్రవీణ తదితర విద్యార్థులు రూపొందించిన ఏకో ఫ్రెండ్లీ సేవర్ బ్రిక్స్‌కు మొదటి బహుమతి వచ్చింది. అలాగే 7వ తేదీన విశాఖపట్నంలోని అవంతి కళాశాలలో నిర్వహించిన జ్ఞాన్–2023 ఫెస్ట్‌లో పాల్గొని అక్కడ సైతం ప్రథమ బహుమతి సాధించారు. దీంతో విద్యార్థులతో పాటు వారికి గైడ్‌గా వ్యవహరించిన ఎం.సురేష్, జి.డి.ఆర్.నాయుడు తదితర అధ్యాపకులను కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు అభినందించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీరామమూర్తి

నందిగాం: మండలంలోని నైగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటామని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అన్నారు. పీహెచ్‌సీ వద్ద వైద్యాధికారి పి.అంజలి ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు, ఎంపీపీ శ్రీరామమూర్తి మాట్లాడుతూ పేద ప్రజల వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పీహెచ్‌సీలో మౌలిక సదుపాయాల కల్పనకు మండల పరిషత్ నిధులు నుంచి రూ.2 లక్షలు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఎం.సుధారాణి, ఎంపీడీవో హెచ్‌వీ రమణమూర్తి, సర్పంచ్ పుష్పాసత్యం, ఎంపీటీసీ బార్నన బాలకృష్ణ, అంబోడి విష్ణు, తమిరె దేవేంద్ర, వైద్యులు సుభాష్, సీహెచ్‌వో సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయంతో పాఠశాలల అభివృద్ధి



సురేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: దాతల సాయంతో ప్రభుత్వ పాఠశాలలు మరింత అభివృద్ధి సాధిస్తాయని ఎంఈవో కురమాన అప్పారావు పిలుపునిచ్చారు. పాండిచ్చేరిలో వ్యాపారవేత్తగా స్థిరపడిన కోరుకొండ రవి కుమార్ జన్మదినం సందర్భంగా ఆయన సోదరుడు, ఉపాధ్యాయుడు కోరుకొండ సురేష్‌కుమార్ తేలుకుంచి ప్రాథమికోన్నత పాఠశాలకు సుమారు రూ.40 వేలు విలువైన ప్రింటర్, 265 మంది విద్యార్థులకు భోజనం ప్లేట్లను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు సురేష్ కుమార్‌ను పాఠశాల సిబ్బంది, పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాతిర్ల రాజశేఖరరెడ్డి, ఎంపీటీసీ మేరుగు సూర్యనారాయణ, హెచ్‌ఎం బెండి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఇచ్ఛాపురం రూరల్:

మండలంలోని నీలాపపుట్టుగ గ్రామానికి చెందిన మజ్జి సంతోషి అనే యువతి కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో పోరాటం చేస్తూ మంగళవారం మృతి చెందింది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెకు ఆర్థిక సాయం అందించేందుకు వెళ్లిన కవిటి మండలం బొరివంక గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ క్లబ్ సభ్యులకు ఆమె మరణ వార్త తీవ్రంగా కలచివేసింది. దీంతో ఆమె దహన సంస్కారాలకు క్లబ్ సభ్యులు తక్షణ సాయంగా రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు క్లబ్ సభ్యులను అభినందించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

టెక్కలి రూరల్: జాతీయ రహదారిపై ఉన్న డివైడర్లను దాటేందుకు అక్రమంగా ఏర్పాటు చేసుకున్న మార్గాల వలనే రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, వాటి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని టెక్కలి ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. దీనిలో భాగంగా టెక్కలి నుంచి కోటబొమ్మాళి వరకు రహదారి డివైడర్లపై అక్రమంగా ఏర్పాటు చేసిన మార్గాలను జేసీబీ సాయంతో గోతులు తీసి మంగళవారం మూసివేశారు. అలాగే జాతీయ రహదారికి అనుకొని ఉన్న గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

ఘన స్వాగతం

ఉద్దానం పర్యటనకు మంగళవారం విచ్చేసిన రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజనికి ఘన స్వాగతం లభించింది. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో పలాస జాతీయ రహదారిపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం ఆమె పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో పర్యటించారు.

– కాశీబుగ్గ

